
# సత్యవాక్కు



# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**AUGUST - 2016**

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6:00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6:30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2:30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7:30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3:30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం<br>రిక్కీ గూటం<br>రోనీ గూటం |

youtube లో satyavanichurchofchrist.com

పై కార్యక్రమములను చూడండి.

మీ బంధు మిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

P.O. BOX. 80, KAKINADA

PIN : 533004, Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు
## THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 004
Ph : 0884 - 2363722, 98489 98547

Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి-37 ఆగష్టు - 2016 సంచిక 1

## క్రైస్తవుడు - ఆరోగ్యము
### *(Christian and his Physical Health)*

శరీర ఆరోగ్యము ప్రతి మానవునికి ముఖ్యముగా క్రైస్తవునికి అత్యవసరము. అందరి వలెనే క్రైస్తవుడు జీవించును. అందరి వలెనే అతడు తన ఆరోగ్యమును కాపాడుకొనవలెను. ఆరోగ్యవంతుడై యుండునట్లు క్రైస్తవుని దగ్గర ఏవిధమైన అద్భుత సూత్రములు లేవు. లోకములోయున్న వారందరు తమ ఆరోగ్యమును కాపాడుకొనుట కెట్లు ప్రయాస పడుదురో అట్లే క్రైస్తవుడు కూడాను. అతడు ఆరోగ్యవంతుడై యుండగా తనకు తానే సంతోషముగా యుండుట మాత్రమే గాక క్రీస్తు శరీరమైన సంఘముయొక్క ఆరోగ్యమును, క్షేమమును కాపాడిన వాడగును.

క్రైస్తవుని శరీరారోగ్యములకును ఆత్మీయ అభివృద్ధికిని సన్నిహిత సంబంధము కలదు. దానిని గూర్చి అపొ.పౌలు ఇట్లు వ్రాసెను: "మీ దేహములు క్రీస్తునకు అవయవములై యున్నవని మీరెరుగరా? నేను క్రీస్తు యొక్క అవయవములను తీసికొని వేశ్యయొక్క అవయవములుగా చేయుదునా? అదెంతమాత్రమును తగదు. వేశ్యతో కలిసికొనువాడు దానితో ఏకదేహమైయున్నాడని మీరెరుగరా?... అటువలె ప్రభువుతో కలిసికొనువాడు ఆయనతో ఏకాత్మయై యున్నాడు. జారత్వమునకు దూరముగా పారిపోవుడి. మనుష్యుడు చేయు ప్రతి పాపమును దేహమునకు వెలుపల

ఉన్నది గాని జారత్వము చేయువాడు తన సొంత శరీరమునకు హానికరముగా పాపము చేయుచున్నాడు. మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి'' (1 కొరింధి 6:15-20). మనము చదువుకొనిన ఈ వాక్య భాగములో మన శరీరము యొక్క ప్రాముఖ్యతను నాలుగు విధములుగ చూడవచ్చును.

**1. దేహము ప్రభువు నిమిత్తమై యున్నదని 6:13లో పౌలు చెప్పుచున్నాడు.** మన జీర్ణకోశము ఆహారము నిమిత్తము ఎట్లయితే నిర్మించబడియున్నదో అట్లే మన శరీరములు దేవుని సేవనిమిత్తము నిర్మించబడియున్నవి. క్రైస్తవుడు తన అవయవములను క్రీస్తు కొరకు వినియోగించిన యెడల దేవుని సేవ చేయగలడు. అందువలన తన శరీరము నతడు దేవుని సేవ నిమిత్తమై వినియోగించగల్గునట్లు ఆరోగ్యవంతుడై యుండవలెను.

**2. క్రైస్తవుల దేహములు క్రీస్తుకు అవయవములై యున్నవి (6:15).** క్రైస్తవులు క్రీస్తు శరీరములో అనగా సంఘములో ఆత్మీయావయవములై యున్నారు. "ఒక్క శరీరమునకు అనేక అవయవములుండినను, ఈ అవయవములన్నిటికిని ఒక్కటేపని యేలాగుఉండదో, ఆలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా ఉండి ఒకనికొకరకము ప్రత్యేకముగా అవయవములై యున్నాము'' అని అపొ.పౌలు రోమా 12:4,5లో వ్రాసెను. క్రైస్తవులు క్రీస్తుతో ఆత్మీయముగా లీనమై యున్నారు. అందువలన వారు తమ శరీరములను క్రీస్తు సేవ నిమిత్తము పవిత్రముగా యుంచవలెను.

**3. క్రైస్తవుని దేహము పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నది.** దేవుని ఆత్మ మనలో నివసించవలెనవిన మన శరీరములు పవిత్రముగను, ఆరోగ్యవంతముగను ఉండవలెను. "మీరు దేవుని ఆలయమై యున్నారనియు దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీ రెరుగరా? ఎవడైనను దేవుని ఆలయమును పాడుచేసినయెడల దేవుడు వానిని పాడుచేయును. దేవుని ఆలయము పరిశుద్ధమైనది; మీరు ఆ ఆలయమై యున్నారు" అని అందుకే క్రైస్తవులను అపొ.పౌలు హెచ్చరించెను (1 కొరింధి 3:16).

**4. క్రైస్తవుడు విలువ పెట్టి కొనబడిన వాడు గనుక అతడు తన దేహముతో దేవుని మహిమపరచు బాధ్యత గలవాడు (6:20).** క్రీస్తు యొక్క పరిశుద్ధ రక్తమువలన పాపముల నుండి విముక్తి పొందినవాడు క్రైస్తవుడు గనుక అతడు క్రీస్తుకే చెందును. "ఆయన సమస్తమైన దుర్నీతి నుండి మనలను విమోచించి సత్ క్రియలయందాసక్తి గల ప్రజలను తన కోసరము పవిత్ర పరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే మన కొరకు అప్పగించు కొనెను" అని తీతు 2:14లో వ్రాయబడి యున్నది.

క్రైస్తవుని దేహము యొక్క ప్రాముఖ్యతను ఈ వచనములు మనకు బోధించుచున్నవి. దేవుని సేవించుటలో క్రైస్తవుని దేహము ఒక పరికరమై యున్నది. అందువలన క్రైస్తవుని దేహము యొక్క ఆరోగ్యమును కాపాడుకొను బాధ్యతను అతడు గుర్తించవలయును. దేవుని కనుకూలమునైన సజీవ యాగముగా తన శరీరము నర్పించు నిమిత్తము అతడు తన ఆరోగ్యమును కాపాడుకొన బాధ్యుడు (రోమా 12:1-2).

"పందెపురంగమందు పరుగెత్తు వారందరు పరుగెత్తుదురు గాని యొక్కడే బహుమానము పొందునని మీకు తెలియదా? అటువలె మీరు బహుమానము పొందునట్లుగా పరుగెత్తుడి. మరియు పందెమందు పోరాడు ప్రతివాడు అన్ని విషయము లందు మితముగా ఉండును. మనమైతే అక్షయమగు కిరీటమును పొందుటకు మితముగా ఉన్నాము. ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి దానిని లోపరచుకొను చున్నాను'' అని అపొ.పౌలు 1 కొరింథి 9:24-27లో వ్రాసెను.

ఈ వచనములను బట్టి మంచి ఆరోగ్యమును క్రైస్తవుడు కలిగి యుండుటయేగాక దాని నభివృద్ధి జేయవలెనని గోచరమగుచున్నది. మన భౌతిక శరీరముల విలువను గ్రహించిన తరువాత దానిని ఆరోగ్యకరముగా ఉంచు బాధ్యతను కలిగియున్నామని మనము గ్రహించవలెను. ఆరోగ్యము ఒక గొప్ప విలువగల దానివలె మనము కాపాడు కొనవలెను. అందుకే 'ఆరోగ్యమే మహాభాగ్యము' అని పెద్దలు పలికిరి.

భౌతిక ఆత్మీయ క్షేమమునకై ఆత్మనిగ్రహము అత్యవసరము.

భౌతికాత్మీయ విషయాల్లో ఆత్మ నిగ్రహము అవసరమని చెప్పుచు పౌలు, "ప్రతివాడు అన్ని విషయములలో మితముగా ఉండును. నా శరీరమును నలగగొట్టి దానిని లోబరచుకొనుచున్నాను" అని చెప్పుచున్నాడు. భౌతిక క్షేమమును భంగపరచు విషయాల్లో క్రైస్తవుడు నిగ్రహబుద్ధిని ప్రదర్శించవలెను. హాని కలిగించు విషయముల నుండి దూరముగ యుండవలెనని, క్షేమకరమైన సంగతులను క్రైస్తవుడు అలవరచుకొనవలెనని ఈ వచనముల ద్వారా పరిశుద్ధాత్ముడు హెచ్చరించుచున్నాడు. "జారత్వము నుండి దూరముగా పారిపోవుడి" యను హెచ్చరిక ఆత్మీయరారోగ్యమును కాపాడుకొనుటకై ఈయబడినది. దేవుని ఆలయమైన మన భౌతిక దేహముల పరిశుద్ధతను భంగపరచు మద్యపానము, ధూమపానము మొదలగు దురలవాట్ల నుండి క్రైస్తవుడు దూరముగా పారిపోవలెను.

ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో యని అపో. పౌలు తనను గూర్చి తాను జాగ్రత్త పడుచున్నట్లు కన్పడుచున్నాడు. అట్టి స్థితి అతనికి సంభవించకుండునట్లు పౌలు 'నా శరీరమును నలగగొట్టి దానిని లోబరచుకొనుచున్నాను' అని చెప్పుచున్నాడు. అపో.పౌలు అంత భయపడుచు ఈ లోకములో తన క్రైస్తవ జీవితము జీవించిన యెడల మనము ఇంకెంత భయపడుచు జీవించవలెను?

మిత్రుడా, దేవుని దృష్టిలోను, మానవుల దృష్టిలోను ఈనాడు నీ జీవితము ఎట్టిది? నీ శరీరమును దుర్వ్యసనములకు, పాపమునకు అప్పగించితివా? అయితే యేసు నీ జీవితములో ఆరోగ్యమునిచ్చుటకు ఈ లోకమునకు వచ్చెను. యేసునందు విశ్వాసముంచుము. నీ పాపపు సంకెళ్ళను త్రెంచివేసి నీకు విమోచనను అనుగ్రహించగల ప్రభువు ఆయన ఒక్కడేయని విశ్వసించుము. నీ పాపముల విషయమై మారు మనస్సు పొందుము. నీ దురలవాట్లను, దుర్వ్యసనములను విసర్జించి క్రీస్తు కొరకు జీవించెదనని నిశ్చయించు కొనుము. నీ పాపములను క్రీస్తు నామమున నీటిలో ముంచబడి కడిగివేసుకొనుము, రక్షింపబడినవాడవై నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ మనస్సుతోను, నీ పూర్ణ దేహముతోను దేవుని జీవితాంతము వరకు మహిమ పర్చుము. అప్పుడు ఆయన నీకు నిత్య జీవ కిరీటాన్ని బహూకరించును. ఆ కిరీటమును నీవు పొందగోరు చున్నావా?

# యేసుక్రీస్తు సిలువ ప్రాముఖ్యత

*(Significance of the Cross of Christ)*

**పరిచయము :**

యేసుక్రీస్తు సృష్టికర్త, అవతార మూర్తి, గొప్ప బోధకుడు అని ఇంత వరకు మనము తెలిసికొన్నాము.

ఈ పాఠంలో క్రీస్తు సిలువ ప్రాముఖ్యతను తెలిసికొందాము.

**I. సిలువ ఒక క్రూరమైన, ఘోరమైన శిక్ష :**

**ఎ. చరిత్రలో ఆయా జనాంగములు వివిధ రీతులుగా శిక్షను అమలుపర్చారు.**

1. రెండు కొయ్యల మీద, ఒకటి నిలువుగానూ, ఒకటి అడ్డముగానూ దిగగొట్టబడిన సిలువ మీద నేరస్థులను వ్రేలాడ దీసేవారు.

2. పురాతన దేశములలో అనేకులు ఏదో రీతిగ సిలువ శిక్షను అమలు పరిచేవారు. ఫినేకీయులు, కార్తిజనీయులు, ఐగుప్తీయులు, పారసీకులు, అష్షూరు దేశస్థులు, రోమీయులు సిలువ శిక్షను అమలుపరచేవారు.

**బి. రోమీయులు సిలువను మరణ శిక్షగా అమలుపరచేవారు**

1. రోమీయుల 9 అడుగుల నిలువు కొయ్యను, 7 అడుగుల అడ్డు కొయ్యను సిలువగా దిగగొట్టేవారు.

2. సిలువ కొయ్యపై ఒక చిన్న కర్రముక్క మధ్యలో యుండేది. అది నేరస్థుని శరీరముయొక్క బరువును కొంతమట్టుకు భరించేది. సిలువ యొక్క పై భాగములో సిలువ వేయబడినవాని నేరమును వ్రాయుటకు చిన్న బల్లలాంటిది అతక బడియుండేది.

3. యేసుప్రభువు సిలువ యొక్క శిలాఫలకముపై "యూదుల రాజైన నజరేయుడగు యేసు" అని వ్రాయబడెను (యోహాను 19:19; మత్తయి 27:37; మార్కు 15:26; లూకా 23:38).

**సి. సిలువ మరణము యొక్క క్రూరత్వము వలన ప్రజలు ప్రభుత్వానికి లోబడియుందురని ప్రభుత్వము యొక్క ఆలోచనయై యుండెను.**

1. ఓడ దొంగలు, రాజకీయ హంతకులు, దేశద్రోహులు, చట్ట విరోధులకు సిలువ శిక్ష వేయబడేది.

2. రోమా సామ్రాజ్యము ఆయా ప్రాంతములను బలవంతముగా తనలో కలుపుకొని కఠినముగా, క్రూరముగా పాలించెను.

3. సిలువ వేయడం కొందరికి నైపుణ్యంగల విద్యయై యుండెను.

**డి. సిలువ వేయబడకముందు కొరడాలతో నేరస్థుల వీపు చిట్లగొట్టేవారు. సిలువ వేయబడక ముందు యిది చాలా క్రూరమైన పరిచయముగా యుండేది. దీనిని మధ్యస్థమరణమని పిలిచేవారు.**

1. నేరస్థుడు బట్టలు ఊడదీయబడి ఒక కొయ్యకు తన అరచేతులు మణికట్టు వరకు కట్టబడి యుండేవాడు. అతని వీపు కొరడా రఘళిపించేవానికి బాహాటముగా త్రిప్పబడియుండేది.

2. కొరడా పిడికి కొన్ని చర్మపు త్రాళ్లు కట్టబడియుండేవి. ఆ త్రాళ్ళ చివర ఎముకల ముక్కలు, ఇనుప కొక్కిళ్ళు మొదలగునవి అతుకబడి యుండేవి. ఇవ్విధమైన కొరడాతో నేరస్థుని వీపుపై కొట్టుచుండగా అతని చర్మము, కండలు ఊడదీయబడి చివరకు ఎముకలు సయితము బయటికి కనబడేవి.

3. ఈలాగున కొరడా దెబ్బలు తినే వారిలో 10 మందిలో 7గురు అక్కడికక్కడే మరణించేవారు.

4. మెస్సీయను గూర్చిన ప్రవచనములలో కొరడా వలన ఘోర బాధ వర్ణించబడినది (కీర్తన 35:15; 129:3; యెషయా 50:6).

**ఇ. కొరడా దెబ్బలు కొట్టిన తరువాత నేరస్థుడు తన సిలువను తానే సిలువ వేయబడే స్థలమునకు మోసికొనిపోవలెను.**

1. పట్టణమునకు వెలుపల ఒక కొండమీదగాని, రాజమార్గము ప్రక్కన గాని మనుష్యులను సిలువ వేసేవారు.

2. నేరస్థుని వివరములు, అతని నేరము వ్రాయబడిన పలక అతనికి ముందుగా, అందరు చదువగల్గునట్లు కొనిపోబడేది.

**ఎఫ్. నేరస్థుడు సిలువకు కట్టబడుటగాని, మేకులతో కొట్టబడుట గాని జరిగేది.**

1. సిలువ వేయబడే స్థలము దగ్గర నేరస్థుడు పూర్తిగా దిగంబరిగా చేయబడేవాడు.

2. నేరస్థుని మణికట్టులోనుండి సిలువ యొక్క అడ్డ కర్రకు మేకులు దిగగొట్ట బడేవి.

3. రెండు కాళ్ళలోనుంచి పొడవాటి మేకు దిగగొట్టబడేది.

4. అప్పుడు ఆ సిలువ భూమిలో త్రవ్వబడిన గోతిలో నిలబెట్టబడి యుండేది.

5. క్రూరమైన కొరడా దెబ్బల

వలన, అవమానముల వలన, శరీరము గుండా దిగ్గొట్టబడిన మేకుల వలన శరీరమంతయు క్రుళ్ళి కృశించెడిది. వచ్చి వుండుగా తయారయ్యేది (యెషయా 1:6).

6. సిలువ వేయబడిన వాడు సాధారణంగా 36 గంటలు బ్రతికి యుండేవాడు. అది అతి క్రూర మరణము.

**జి. సాధారణంగా నలుగురు సైనికులు ఒక శతాధిపతి, సిలువ మీదనున్న వానిని ఎవడు ఎత్తికొని పోకుండు నిమిత్తము అక్కడ కాపలా యుండేవారు** (యోహాను 19:23; మత్తయి 27:54).

**హెచ్. ఇశ్రాయేలులో రోమీయులు ఈ సిలువ పద్ధతికి స్వల్ప మార్పులు చేసారు.**

1. ఇశ్రాయేలు గాక వేరే ప్రజలు సిలువ వేయబడితే సిలువ పైనే శవములు వ్రేలాడి క్రుళ్లిపోయేవరకు ఉంచేవారు. వారి శవములను పక్షులు పీక్కుతినేవి.

2. మోషే ధర్మశాస్త్రము సిలువ వేయబడిన వాడు చీకటి పడేంతవరకు సిలువపై యుంచుటను నిషేధించినది. గనుక యిట్లు ధర్మశాస్త్రము అమలు పరచబడేది (ద్వితీ 21:22-23; అపో.కా.5:30; 10:39; గలతీ 3:13).

3. అందువలన చీకటి పడే వరకు సిలువమీద యున్నవాడు బ్రతికియుంటే వాడు త్వరితగతిని ప్రాణము విడుచునట్లు రోమీయులు అట్టివాని కాళ్ళు విరుగ గొట్టేవారు. వారు చనిపోగానే సిలువ మీద నుండి ఆ శరీరమును క్రిందికి దించేవారు (యోహాను 19:31-34).

**I. యేసు నీ కొరకు అంత ఘోర సిలువ మరణమును సహించారు.** మనము ఆత్మీయముగా నిత్యము జీవించునట్లు యేసు ప్రభువు యిష్టపూర్వకముగా భౌతిక మరణము ననుభవించారు.

**II. కల్వారి సిలువపై యేసు క్రీస్తు యొక్క మరణము క్రైస్తవ్యమునకు ముఖ్య మూలాధారమైయున్నది.**

ఎ. యేసుక్రీస్తు యొక్క సిలువ మరణము ఆశ్చర్యము కాదు.

1. రక్షకుడు అట్టి హీనస్థితి మట్టుకు తన్నుతాను తగ్గించుకొనునని పాత నిబంధన ప్రవచనములు చెప్పెను, కొరడాదెబ్బలు, సిలువ మొ॥నవి ముందుగనే ప్రవచింపబడెను (కీర్తన 22:16 - 18; 69:12; యెషయా 53:1-2).

2. ఆయన రోమీయులచే సిలువ వేయబడి చంపబడుదునని యేసుక్రీస్తు తానే చెప్పారు (మత్తయి 10:28; లూకా 14:27).

బి. ఈ లోకమును పాపమునుండి రక్షించుటకు యేసు యొక్క కృషిలో సిలువ మరణము ఆఖరివెట్టు (యోహాను 3:14-17; 1 యోహాను 3:16).

1. క్రైస్తవుడు క్రీస్తు సిలువ మరణము, సమాధి, పునరుత్థానమును సారూప్యముగా బాప్తిస్మములో చిత్రీకరించును (గలతీ 2:20; 6:14; రోమా 6:3-13).

2. సిలువ ద్వారా మానవులంతా యూదులు, అన్యులు కూడ దేవునితో సమాధానపడు మార్గమును యేసుక్రీస్తు తెరచి యున్నారు (ఎఫెసీ 2:16; కొలస్స 1:20).

సి. క్రైస్తవ్యమును గూర్చిన యితర వివరములన్నియు నేరుగా సిలువతో సంబంధము గలవియై యున్నవి.

1. క్రీస్తు సిలువ ద్వారా పాత నిబంధన క్రొత్త నిబంధన వలన ఎత్తివేయబడెను (కొలస్స 2:14).

2. సిలువ బలియాగము ద్వారా యేసుక్రీస్తు పస్కాపశువుయొక్క నిజ స్వరూపమాయెను (నిర్గమ 12:46; యోహాను 19:33-36).

డి. ఇదియేగాక సిలువ మీద వ్రేలాడబడు యేసు ప్రభువు మనస్థానములో అనుభవించిన సిగ్గును, అవమానమును, హింసను గ్రహించుము.

1. యూదా మతములో సిలువపై శవముగా వ్రేలాడబడుట బహు శాపగ్రస్థమైనది (ద్వితీ 21:22-23).

2. పరిశుద్ధ దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నీ కొరకు, నా కొరకు ఈ శాపమును భరించారు (గలతీ 3:13).

3. యేసుక్రీస్తు ఇట్టి అవమాన కరమైన సిలువ మరణము నొంది నందున మొదటి శతాబ్దములో అనేకులు విశ్వాసులగుటకు అభ్యంతర పడిరి. కాని క్రైస్తవులు ఇట్టి ఘోరమైన సిలువను మహిమాన్విత రక్షణ మార్గముగా మార్చిరి (1 కొరింథీ 1:18, 23).

4. యేసుక్రీస్తు సిలువ అవమానమును సహించినందు వలన ఆయన రాజులకు రాజుగాను, ప్రభువులకు ప్రభువుగాను పట్టాభిషేకము చేయబడెను (హెబ్రీ 12:2).

ఇ. అనేకులైన క్రైస్తవులు, క్రైస్తవేతరులు కూడ సిలువ యొక్క

శత్రువులుగా తమ్మును తాము తయారు చేసికొనిరి (ఫిలిప్పీ 3:18).

1. క్రైస్తవులు మానవ కల్పిత జ్ఞానము ననుసరించి సిలువను నిరర్థకము చేయకుండా చూచుకొనాలి (1 కొరింథీ 1:17).

2. సిలువ వలన అభ్యంతర పడేవారు నేడుకూడ చాలామంది యున్నారు (గలతీ 5:11).

ఎఫ్. యేసుప్రభువు మానవుల కొరకు శ్రమలనొందిన రక్షకునిగా యుండు నిమిత్తము వరలోక మహిమను విడచివచ్చారు (యోహాను 3:17).

1. యేసుక్రీస్తు సువార్తను మనము అంగీకరించకపోతే ఆయన మరణించుట వ్యర్థము (రోమా 1:16; హెబ్రీ 5:9).

2. నశించిన వారిని వెదకి రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చారు గాని మనము దేవునితో సహకరించాలి (లూకా 19:10; ఫిలిప్పీ 2:12).

బి. క్రైస్తవులు అనుక్షణము క్రీస్తు మార్గమును అనుసరించకపోతే క్రీస్తు యొక్క బలియాగము వ్యర్థమగును (లూకా 6:46; మత్తయి 7:21).

1. యేసుయొక్క పిలుపును నిరాకరించువారికి ఆయన ప్రభువు కాదు (లూకా 6:46; మత్తయి 7:21).

2. మానవ జాతి, ముఖ్యముగా క్రైస్తవులు సత్క్రియలు చేయాలి. వాటియందు ఆసక్తి కలిగి యుండాలి (ఫిలిప్పీ 4:8; తీతు 2:12).

3. ప్రతి వారము క్రైస్తవులు దేవుని నారాధింప బాధ్యులైయున్నారు (హెబ్రీ 10:25; అపో.కా. 20:7; 1 కొరింథీ 16:1-2).

4. క్రైస్తవులు క్రీస్తు సువార్తను ప్రపంచమంతటా చాటించాలి. క్రైస్తవులకు, క్రైస్తవేతరులకు మేలు చేయాలి (మార్కు 16:15-16; 1 పేతురు 2:2; గలతీ 6:10).

5. క్రైస్తవులు సత్ క్రియల యందాసక్తి కలిగియుండాలి (తీతు 2:14; యాకోబు 2:18).

సి. మన ప్రభువును సిలువపై ఏలాగు వ్రేలాడదీసారో ఆలోచింపుము:

1. నిజంగా ఇనుపమేకులు ఆయన శరీరములోనుండి సిలువ కొయ్యకు దిగ గొట్టిరి.

2. సిలువపైనుండి దిగి వచ్చేయడానికి లేదా వేల కొలది సేవా వ్యూహములను పిలవడానికి ఆయనకు

శక్తియుండెను. ఆయన శత్రువులను లోకమును నాశనము చేయు శక్తియుండెను (మత్తయి 27:40, 42; 26:53).

3. నిజానికి మేకులు కాదు గాని నీ యొక్కయు నాయొక్కయు పాపములు ఆయనను సిలువకు అంటగొట్టెను.

4. నీవు, నేను చేయు ప్రతి పాపము ఆయనను అనుదినము మరల సిలువ వేయుచున్నది (హెబ్రీ 6:6).

5. క్రైస్తవులు చేయు అపరాధముల వలన ఆయన సిలువ వేయబడు చున్నట్లగుపడుచున్నది.

**ముగింపు :**

1. రోమీయులకు సిలువ యనగా శిక్షయని తప్ప వేరే ప్రత్యేక గుర్తింపు యేమీ లేదు. క్రైస్తవ్యము వ్యాప్తి చెందిన మీదట సిలువ ఒక చారిత్రాత్మక, వేదాంత, చట్టపరమైన ముఖ్య గుర్తుగా మార్పు జెందినది.

2. సిలువ యనగా వివిధ రీతులుగా అమలు పరచబడుచున్న మరణ శిక్షలలో ఒకటి. యిది అతి క్రూరమైన మరణశిక్ష.

3. సిలువ వేయబడు వానికి, వాని కుటుంబమునకు, బంధువులకు మిత్రులకు భయంకరమైన అవమానమును కల్పించుటకు సిలువ శిక్ష ఉద్దేశించబడెను.

4. అయితే దేవుని బిడ్డ యైన వానికి సిలువ యేసుక్రీస్తు ద్వారా కలిగిన విజయమునకు గొప్ప గురుతు.

**ఆహ్వానము :**

1. యేసుక్రీస్తు నేడు నీ రక్షకుడా?

2. యేసుక్రీస్తు నీ రక్షకుడు కాకపోతే నీవింకా పాపములలోనే యుండి ఆయనను మరల సిలువ వేయు చున్నావు (అపొ.కా. 8:22; 1 యోహాను 1:9).

3. సువార్తకులోబడి ఆయన యందు విశ్వాసముంచి, మారు మనస్సు పొంది బాప్తిస్మము పొంది రక్షింపబడుము (మార్కు 16:16; అపొ.కా. 2:38; రోమా 6:3-6).

- లూయిస్ రష్మోర్

# దేవుని దయాళుత్వము

*(The Goodness of God)*

పరమందొక దేవుడున్నాడు! ఆయన ఎట్లుంటారు? దేవుడు సర్వశక్తిమంతుడని యిదివరకే తెలిసికొన్నాం. అంటే ఆయన కంటే ఘనమైన శక్తి యేదీలేదు; ఆయన చిత్తము చొప్పున ఆయన ఏమైనా చేయగలరని దాని యర్థము. ఆయన శక్తి పరిమితి లేనిది.

నిరంకుశ పాలకుడు, బందిపోటు దొంగల నాయకుడు కొంత మట్టుకు అవధులు లేని బలాన్ని ప్రదర్శింప వచ్చును. అయితే దేవుడు నిరంకుశుడా? ఆయన సర్వశక్తిమంతుడు మాత్రమే అయితే ఆయన నిరంకుశుడు కావచ్చును. అయితే దేవుని యదార్థ బయల్పాటు అయిన బైబిలు దేవుడు దయాళుడు, మంచివాడు అని బోధించుచున్నది. దీని అర్థమేమిటంటే?

**దయాళుత్వము యొక్క నిర్వచనము**

ఏదైనా మంచి ప్రయోజనమునకు ఉపయుక్తపడునది మంచితనము అని సోక్రటీసు చెప్పాడు. ప్రతివాడు కోరుకొనేదేదో అదే మంచిదని గ్రీకులు చెప్పేవారు. మంచిదైనది ప్రాముఖ్యమైనది, బలమైనది, ఘనమైనది మరియు అందమైనదని నీయట్సే యనునాయన చెప్పాడు. ఒక యింటికున్న బలమైన లక్షణాలను బట్టి అది మంచి యిల్లని, మిత్రుని యొక్క నమ్మకత్వమును బట్టి అతడు మంచి వాడని మనం చెబుతాం. లాభ నష్టాలున్నా లేకపోయినా, నైతికంగా హితమైనది మంచిది. ఈ విషయంలో దేవుడు సర్వపరిపూర్ణత యొక్క మొత్తమై యన్నారు.

అందువలన దేవుని యొక్క మంచితనమును నిర్వచించాలంటే, మనం దేవుని యొక్క వివిధ లక్షణములను వెదకాలి. "నిశ్చయముగా దేవుడు దయాళుడై యున్నాడని" కీర్తన 73:1 చెప్పుచున్నది. "ప్రభువా నీవు దయాళుడవు" అని కీర్తన 86:5 చెప్పుచున్నది. "యెహోవా అందరికీ ఉపకారియని కీర్తన 145:9 చెప్పుచున్నది. "దేవుని కృప నిత్యముండును" అని కీర్తన 52:1 చెప్పుచున్నది. యెహోవా కనికరము, దయ, దీర్ఘశాంతము, విస్తారమైన కృపాసత్యములు గల వాడని నిర్గమ 34:6 చెప్పుచున్నది.

**దేవుడు పరిపూర్ణుడు గనుక మంచివాడు**

దేవుని యొక్క మంచితనాన్ని ఒక్కమాటలో వర్ణింపవచ్చును. ఆయన పరిశుద్ధుడు! పరలోకమందున్న దూతలు ఆయన యెదుట వంగి, "యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడని" గానప్రచారములు చేయుచుందురు (యెషయా 6:3). పరిశుద్ధతను బట్టి దేవుడు మహనీయుడని నిర్గమ 15:11 చెప్పుచున్నది. "దేవుడు తన పరిశుద్ధ సింహాసనముపై ఆసీనుడై యున్నాడని" కీర్తన 47:8 చెప్పుచున్నది. ఆయన తన కార్యము లన్నింటిలోను పరిశుద్ధుడు. పరిశుద్ధత యను పదమునకు

ప్రత్యేకముగా యుండుట యని భావము. అందువలన ఆ పదము వేరుగా యుండుటను, ప్రత్యేకముగా యుండుటను నిర్దేశించును. దేవుడు పాపమునుండి పాపినుండి వేరై, ప్రత్యేకముగా యున్నవాడు. తన పరిశుద్ధతలో ఆయన మానవుని నుండి హెచ్చుగా యున్నవాడు. అందువలన హోషేయ 11:9లో "నేను మీ మధ్య పరిశుద్ధ దేవుడనుగాని మనుష్యుడను కానని" ఆయన చెప్పారు. పరిశుద్ధత దేవునితో జత కూర్చబడినది. ఆయన మానవునికంటే ఘనుడు గనుక ఆయన పరిశుద్ధత మానవుని నుండి ఆయనను ప్రత్యేకపరచును. అయినను ఆయన పరిశుద్ధుడు గనుక ఆయన మన ఆదర్శమూర్తియైయున్నారు. అందువలన "నేను పరిశుద్ధుడనై యున్న ప్రకారము మీరును పరిశుద్ధులై యుండుడి" యను మాటలను మనం గ్రంథములో చదువుతాము. పరిశుద్ధత లేకుండ ఎవడును దేవుని చూడ నేరడని హెబ్రీ 12:14లో వ్రాయబడి యున్నది.

## దేవుడు నీతిమంతుడు, యథార్థవంతుడు గనుక మంచివాడు

దేవుని యొక్క పరిశుద్ధత, మంచితనములను ఆయన నీతి న్యాయములతో మనం నిర్వచింప వచ్చును. "ఆయన చర్యలన్నియు న్యాయములు, ఆయన నిర్దోషియై నమ్ముకొన దగిన దేవుడు. ఆయన నీతిపరుడు యథార్థవంతుడు" అని ద్వితీ 32:4లో చెప్పబడి యున్నది. దేవుని నీతి గొప్ప పర్వతముల వలె నున్నదని కీర్తన 36:6 చెప్పుచున్నది.

దేవుడు నీతిపరుడనుటలో ఆయన చర్యలన్నియు న్యాయములని, ఆయనలో న్యాయ ప్రమాణము మనకున్నదని, దేవుడు చట్ట ప్రకారము చలించునని మనము గ్రహించాలి. ఆయన వంగేవాడు కాదు, పక్షపాతి కాదు గాని యేది న్యాయమో దానిని బట్టియే చలించువాడు. యేది రైటో, దానినే దేవుడు ఎల్లవేళలా జరిగిస్తారు.

దేవుని యథార్థతను గూర్చి చెప్పుకోకుండా ఆయన నీతిని గూర్చి చెప్పుకొనుట అసంభవము. ఈ రెండు విడదీయ రానివి. అందువలననే ఆయన నీతిపరుడు, యదార్థ వంతుడని ద్వితీ 32:4 చెప్పుచున్నది. ఆయన యథార్థవంతుడనుటలో ఆయన మంచివారికి, చెడ్డవారికి కూడ తమ క్రియల ఫలము నిచ్చునని తెలిసికోవాలి. ఆయన స్థాపించును (కీర్త 7:9), సహాయము చేయును (కీర్త 31:1), జవాబిచ్చును (కీర్త 65:5), విమోచించును (కీర్త 34:22), నీతిమంతులకు అనేక దీవెనలిచ్చును.

నలిగిన వారికి ఆయన మహాదుర్గము (కీర్తన 9:9), బీదలను రక్షించును, ఆదుకొనును (కీర్తన 72:12-14), ఆపదలలో నున్నవారిని ఆదుకొనును (యోబు 34:28), విధవరాలి పక్షమున వాదించును (యెషయా 1:14), తల్లిదండ్రి లేనివారికి న్యాయము చేయును (కీర్తన 82:3), ప్రయాసపడువారికి సేద తీర్చును (మత్తయి 11:28), మారు మనస్సుపొందిన వానిని క్షమించును (కీర్తన 32:5), మరియు యధార్థపరులను నీతిమంతులుగా తీర్చును (ద్వితీ 25:1).

## నీతి న్యాయములు శిక్షను కోరును

అయితే దేవుని నీతిన్యాయములు దుష్టులను ఆయన శిక్షించాలని కోరును. గనుక దుర్నీతి పరులపై ఆయన రౌద్రము రగులు కొనును, వారికి శ్రమయు వేదనయు కలుగునని రోమా 2:8-9 చెప్పుచున్నది. ఆయన అపవాదిని వాని అనుచరులను శిక్షించకపోతే యధార్థవంతుడు కాడు. దేవుని ప్రతిదండన తీవ్రముగా యుండునని వర్ణించబడినది (కీర్త 58:9), అది భయంకరమైనది (కీర్త 76:7), వినాశకరమైనది (యిర్మి 42:18), భీకరమైనది (హెబ్రీ 12:11). అందువలన దుష్టుల తీర్పును శిక్షయు దేవుని నీతి న్యాయముల భాగమైయున్నది. "భూ జనులకు తీర్పు తీర్చుటకై యెహోవా వేంచేయు చున్నాడు.. న్యాయమును బట్టి లోకమునకు తన విశ్వాస్యతను బట్టి జనములకు ఆయన తీర్పు తీర్చును" అని కీర్త 96:13 చెప్పుచున్నది.

## శిక్ష సరిదిద్దుటకే

దేవుడు దుష్టులకు తీర్పు తీర్చి శిక్షించుట వారిని నాశనము చేయుటకు కాదు కాని వారిని సరిదిద్దుటకే, వారుతమ దుర్మార్గత నుండి తిరిగి, మార్పునొంది, న్యాయము జరిగించి రక్షించబడుటకే ఆయన శిక్షించును. మరియు ప్రస్తుతమందు సమస్త శిక్షయు దుఃఖకరముగా కనబడునే గాని సంతోషముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము కలిగిన వారికి అది నీతియను సమాధాన కరమైన ఫలమిచ్చును" (హెబ్రీ 12:1). ఆత్మ రక్షింపబడునట్లు శరీరము శిక్షననుభవించునని 1 కొరింధీ 5:5 చెప్పుచున్నది.

## పరిపూర్ణ న్యాయము తీర్పులో జరిగించబడును

దుష్టులు తమ దుర్మార్గతనుండి మరలుకొనకపోతే దేవుని యొక్క మహా రౌద్రమును తీర్పులో ఎదుర్కొందురు.

2 థెస్స 1:7-10 ఇట్లు చెప్పుచున్నది. "ప్రభువైన యేసు తన ప్రభావమును కనపరచు దూతలతో పరలోకము నుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమ పరచువారిని శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశు ద్ధులయందు మహిమ పరచబడుటకును విశ్వసించిన వారందరి యందు ప్రశంసించ బడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖము నుండియు, ఆయన ప్రభావమందలి మహిమ నుండియు పారదోలబడి నిత్య నాశనమను దండన పొందుదురు". దేవుడు నీతి న్యాయములను జరిగించాలంటే ఆయన దుష్టులను శిక్షించాలి. ఏలయనగా దుష్టత్వము, దుర్మార్గత అన్యాయము శిక్షించబడ కుండా విడిచిపెట్టబడకూడదు. అందుకే "మనుష్యుడేమి విత్తునో ఆ పంటనే కోయునని" బైబిలు చెప్పుచున్నది (గలతీ 6:7). ఈ లోకంలో తరుచు దుష్టులు, అపరాధులు శిక్షింపబడకుండా తప్పించుకు పోవుచున్నట్లగుపడు చున్నది. గాని తీర్పు దినమందు వారికి తగిన శిక్షను న్యాయబద్ధముగా దేవుడిచ్చును. "ఆయన ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫల మిచ్చును" (రోమా 2:5-6).

## దేవుని మంచి తనము వివిధములుగా యుండును

దేవుని ఉద్దేశ్యమును బట్టి ఆయన మంచి తనము వివిధములుగా యుండును. శిక్షకు పాత్రులైన వారి యెడల ఆయన ఓరిమి దీర్ఘశాంతము వలె ప్రదర్శింపబడును. "యెహోవా దీర్ఘశాంతుడును కృపాతిశయుడును, దోషమును అతిక్రమమును పరిహరించువాడును" అయ్యున్నాడని సంఖ్యా 14:18 చెప్పుచున్నది. "యెహోవా దయాళుడు, ఆయన కృప నిరంతరముండును. ఆయనను స్తుతించుడి" యని 1 దిన 16:34 చెప్పుచున్నది. నలుగగొట్టబడిన వారి యెడలను అణగద్రొక్క బడినవారి యెడలను యున్న దేవుని మంచితనము దయాదాక్షిణ్యమని చెప్పబడినది. "ప్రభువా నీవు దయాదాక్షిణ్యములు గల దేవుడవు, దీర్ఘశాంతుడవు, కృపా సత్యములతో నిండిన వాడవు" (కీర్తన 86:15). కీర్తన 103:8-14 ఇట్లు

చెప్పుచున్నది: "యెహోవా దయా దాక్షిణ్య పూర్ణుడు, దీర్ఘశాంతుడు, కృపానమృద్ధి గలవాడు. ఆయన ఎల్లప్పుడు వ్యాజ్యెమాడువాడు కాడు. ఆయన నిత్యము కోపించువాడు కాదు. మన పాపములను బట్టి మనకు ప్రతీకారము చేయులేదు, మన దోషములను బట్టి మనకు ప్రతిఫల మియ్యలేదు. భూమికంటె ఆకాశము ఎంత ఉన్నతముగా ఉన్నదో ఆయన యందు భయభక్తులు గలవారి యెడల ఆయన కృప అంత అధికముగా ఉన్నది. పడమటికి తూర్పు ఎంత దూరమో ఆయున మన అతిక్రమములను అంతదూర పరచి యున్నాడు. తండ్రి తన కుమారుల యెడల జాలి పడునట్లు యెహోవా తన యందు భయభక్తులు గలవారి యెడల జాలి పడును. మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసే యున్నది. మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసికొనుచున్నాడు".

## దేవుని మంచితనము కృపలో ప్రకటింపబడినది

శిక్షకు ప్రతిదండనకు పాత్రులైన వారియెడల దేవుని దయాళుత్వము మహిమాన్వితముగా బయలు పరచబడుచున్నది. అది కృప అని పిలువబడినది. అపరాధులు పాత్రులు కాకపోయినను వారి యెడల చూపబడిన మంచి తనము, దయాళు త్వమే. కృప వలన అట్టి వారికి జీవము, రక్షణ, నీతిమంతులుగా తీర్చబడే తరుణము, మరణమునకు బదులు జీవము అనుగ్రహించబడుచున్నది. తీతు 3:5–7లో దేవుని యొక్క కృపా బాహుళ్యముల ఘనత ఇట్లు వర్ణించబడినది : "మనము నీతి ననుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను. మనమాయన కృపవలన నీతిమంతులమని తీర్చబడి నిత్య జీవమును గూర్చిన నిరీక్షణను బట్టి దానికి వారసుల మగుటకై ఆ పరిశు ద్ధాత్మను మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా ఆయన మన మీద సమృద్ధిగా కుమ్మరించెను".

"ఆహా దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము, ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు, ఆయన మార్గము లెంతో అగమ్యములు!" (రోమా 11:33).

– ఓటిస్ గేట్వుడ్

# నీ పరిశుద్ధ పర్వతము మీద నివసింపదగిన వాడెవడు?

***(Who shall dwell in thy Holy Hill)***

ఈ భూమిపై మానవ జీవిత మనుగడ కొరకు ప్రాముఖ్యముగ ఆహారము, వస్త్రములు, నివాసము ముఖ్య అవసరతలుగ యున్నవి. మానవులు గృహములు నిర్మించు కొనెదరు, రాజులు రాజ సౌధములలో నివసింతురు. పక్షులకు గూళ్ళు, సింహములకు దట్టమైన అడవులలో బొరియలు, నక్కలకు కూడా బొరియలు నివాస యోగ్యములుగ యున్నవి. కీర్తనకారుడు యెహోవా నీ గుడారములో అతిథిగా యుండదగిన వాడెవడు? నీ పరిశుద్ధపర్వతము మీద నివసింవదగిన వాడెవడు? అని ప్రశ్నించుచున్నాడు (కీర్తనలు 15:1). మోషే నాయకత్వము ద్వారా ఇశ్రాయేలీయులు ఐగుప్తు దాసత్వము నుండి విడిపింపబడినపుడు దేవుని కొరకు ఒక పరిశుద్ధ స్థలమును నిర్మించుటకు వారితో ఒడంబడికను చేసికొని వారి కాజ్ఞాపించెను (నిర్గమ 25:8). దేవుడు వారి మధ్య నివసించునట్లు మనః పూర్వకముగా కానుకలు యిచ్చుట ద్వారా పరిశుద్ధ మందిరమును వారు నిర్మించిరి (నిర్గమ 25:8, 35 అధ్యాయము).

**పర్వతముల ప్రాముఖ్యత :** బైబిలు గ్రంథము నందు కొండలు, పర్వతములు ప్రత్యేక స్థానము కలిగియున్నవి. నోవహు కాలములో కలిగిన ఆ గొప్ప జల ప్రళయము సమయములో నిర్మింపబడిన ఓడ అరారాతు పర్వతముల పై ఆగినది. అబ్రహాము కుమారుడైన ఇస్సాకును మోరియా పర్వతముపై బలి ఈయుమని దేవుడు అబ్రహాముతో చెప్పెను. అది “యెహోవా యీరే” అని అనబడు చున్నది. హోరేబు పర్వతముపై నున్న ఒక మండుచున్న పొద దగ్గర దేవుడు మోషేకు ప్రత్యక్షమయ్యెను (నిర్గమ 3:2). ఇశ్రాయేలీయులకు సీనాయి పర్వతము పై పాత నిబంధన చట్టములు, పది ఆజ్ఞలు ఈయబడెను. ఇశ్రాయేలీయులు యొర్దాను నది దాటి వాగ్దాన దేశములో ప్రవేశించిన వెంటనే యెహోషువ సీనాయి కొండపై దేవునికి బలిపీఠము కట్టెను. మోషే ఇశ్రాయేలీయులకు వ్రాసియిచ్చిన ధర్మశాస్త్ర గ్రంథమును ఒక ప్రతిని అక్కడ ఆ రాళ్ళ మీద వ్రాయించెను (యెహోషువ 8:30-35).

ఏలియా కర్మెలు పర్వతముపై

450 మంది బయలు ప్రవక్తలను యెహోవా దేవుని విషయములో సవాలు చేసెను. వారిని చంపెను (1 రాజులు 8:20-40). హోరేబు కొండ పైనున్న ఒక గుహలో ఏలియా ప్రవక్తకు దేవుని ద్వారా సమకూర్చబడిన ఆహారము, నిప్పులపై కాల్చబడిన అప్పము తిని, నీళ్ళబుడ్డిలో యున్న నీళ్ళు త్రాగి బలము పొందెను (1 రాజులు 19:20). దేవుని పర్వతమైన హోరేబునకు నడిచివెళు ్ళటకు బలము పొందెను. కొండల తట్టు నాకన్నులెత్తు చున్నాను. నాకు సహాయమెక్కడ నుండి వచ్చును అని దావీదు పాడుచున్నాడు (కీర్త 121:1).

మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు ఈ లోకములోనికి వచ్చుట ద్వారా ఆజ్ఞను నెరవేర్చి పాత ఆజ్ఞను కొట్టివేసి క్రొత్త ఆజ్ఞను గలిలయ పర్వతము మీద నుండి అనుగ్రహించెను. మత్తయి 5,6,7 అధ్యాయములలో మనము కొండమీద ప్రసంగముగ వాటిని చదువుదుము. యేసుకొండ మీద రూపాంతరము పొందెను (మత్తయి 17:1,2, మార్కు 9:2, లూకా 9:28). యేసు కల్వరి కొండపై మన పాపముల విషయమై సిలువలో మరణించెను. యేసు దేహము రాతిలో తొలిపించిన క్రొత్త సమాధి యందుంచబడెను (మత్తయి 27:59; మార్కు 15:46; లూకా 23:53; యోహాను 19:40). యేసు ఒలీవల కొండ నుండి పరలోకమునకు ఆరోహణుడయ్యెను (అపొ.కా. 1:12). పర్వతములతో ఆవరింపబడిన పరిశుద్ధ నగరమైన యెరుషలేములో పెంతెకొస్తు దినమున సంఘము స్థాపించబడెను.

**సంఘారంభము :** బైబిలు యందలి ప్రాముఖ్యమైన చరిత్ర సంఘటనలన్నియు ఉన్నత స్థలములైన కొండలు, పర్వతముల పైననే జరిగెను. క్రీస్తు పూర్వము 700 సం॥లో ప్రవక్తయైన యెషయా ఈ విధముగా ప్రవచించెను. "అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము, పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. యాకోబు దేవుని మందిరమునకు, యెహోవా పర్వతమునకు మనము వెళ్ళుదము రండి అని చెప్పుకొందురు. ఆయన మధ్యవర్తియై అన్యజనులకు న్యాయము తీర్చును" (యెషయా 2:2-4). దేవుని మందిరము అనగా జీవముగల దేవుని

సంఘములో జనులు యెట్లు ప్రవర్తించవలెనో మనకు తెలియును. ఈ సంఘము యెరూషలేములో పెంతుకోస్తు దినమున ప్రారంభించబడెను (1 తిమోతి 1:15). సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తము పైన ఆయనను సంఘమునకు శిరస్సుగా యుంచెను (ఎఫెసీ 1:22). క్రీస్తు సంఘమునకు శిరస్సయి యుండులాగున పురుషుడు భార్యకు శిరస్సయి యున్నాడు (ఎఫెసి 5:22). యేసు దేవుని కుమారుడని నమ్మి, పాపముల విషయమై మారు మనస్సు పొంది, యేసును రక్షకునిగ ఒప్పుకొని బాప్తిస్మము తీసుకొనవలెనని పేతురు పెంతుకోస్తు దినమున మొదటి సువార్తను ప్రకటించెను (అపో.కా. 2:38). ఆ మొదటి సువార్త ప్రసంగము వినిన యూదులలో పదహారు జనములలోని వారు యేసుని రక్షకునిగా అంగీకరించి వారి పాపక్షమాపణ నిమిత్తము ఆ దినమున మూడు వేలమంది యేసులో బాప్తిస్మము పొందిరి. వారు దేవుని మందిరములో ప్రవేశించిరి. అన్యజనాంగములో నుండి కోర్నేలి, అతని కుటుంబ సభ్యులు మొదట దేవుని బిడ్డలుగ చేరిరి (అ.కా. 10 అధ్యా). వారును దేవుని మందిరములో ప్రవేశించిరి. అపోస్తులుడైన పౌలు అన్యజనులకు సువార్త బోధించి దేవుని మందిరమునకు వారిని చేర్చుటకు యేర్పరచబడెను. దేవుని పరిశుద్ధ పర్వతమునకు లేక దేవుని మందిరమునకు యూదులు, అన్యజనాంగములు తరలివచ్చు చుండిరి.

**గొప్ప అజ్ఞ :** యేసు యూదయ, సమరయ, గలిలయ ప్రాంతముల యందంతటను దేవుని వాక్యము బోధించుచు వారికి నేర్పుచుండెను. ఆయన పరలోకమునకు ఆరోహణుడై వెళ్ళక పూర్వము ఆయన శిష్యులకీ విధముగా అజ్ఞాపించెను. “మీరు సర్వలోకమునకు వెళ్ళి సువార్త ప్రకటించి సమస్త జనులను శిష్యులుగా చేయండి. తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను అజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా యున్నానని వారితో చెప్పెను (మత్తయి 28:19-20). క్రొత్త నిబంధన ద్వారా వాక్యము మనకు బోధింపబడుచున్నది.

యెహోవా గుడారములో... యెహోవా గుడారములో అతిథిగా యుండదగిన వాడెవడు? ఆయన పరిశుద్ధ పర్వతముపై నివసింపదగిన వాడెవడు? అని కీర్తనాకారుడు యెహోవా దేవుని అడుగుచున్నాడు (కీర్త 15:1). పరిశుద్ధ పర్వతము లేక పరిశుద్ధ సంఘములోనికి ప్రవేశించుటలేక నివసించుట కొరకు వాక్యమును వినుట ద్వారాను, నమ్ముట ద్వారాను, పాపముల విషయమై మారు మనస్సు పొందుట ద్వారాను, యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్మి, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుట ద్వారాను మనము ప్రవేశించగలము (అ.కా. 2:38, 47). ఈ ప్రశ్నకు జవాబులు ఈ క్రింద ఈయబడిన కొన్ని వాక్యభాగముల ద్వారా గ్రహించగలము.

**1) నీతిగా జీవించుట :** యోబు వలె నీతిమంతునిగ పరిశుద్ధునిగ జీవించి పాపమును ద్వేషించు వానిగ, దేవుని యందు భయభక్తులు గలవానిగ యుండవలెను. దేవుడు పాపమును అసహ్యించుకొనును. యోబు వలె పాపమును ద్వేషించు వారముగ యుండవలెను.

**2) నీతి గలిగి జీవించాలి :** యెహోవా మార్గములు చక్కనివి. నీతిమంతులు దానిననుసరించి నడుచుకొందురు. తిరుగుబాటు చేయువారి దారికి అది అడ్డము గనుక వారు తొట్రిల్లుదురు (హోషేయ 4:9).

**3) యధార్థ హృదయము కలిగియుండుట :** ఎల్లప్పుడు యధార్థము పలుకవలెను. అబద్ధికులుగా యుండరాదు. తమ పొరుగు వారితో యెల్లప్పుడు యదార్థమే పలుకవలెను. మనము ఒక్కరికొకరము అవయవములమై యున్నాము గనుక మీరు అబద్ధమాడుట మాని ప్రతివాడు తన పొరుగు వానితో సత్యమే మాట్లాడవలెను (ఎఫెసి 4:25).

**4) నాలుకను అదుపులో యుంచుకొనుట :** నాలుక అవయవములలో ఉంచబడిన పాప ప్రపంచమై సర్వ శరీరమునకు మాలిన్యము కలుగజేయును. ప్రకృతి చక్రమునకు చిచ్చు పెట్టుచు అది నరకము చేత చిచ్చు పెట్టబడును. నాలుకను అదుపులో పెట్టుటను గూర్చి యాకోబు వివరించెను (యాకోబు 3:2-12; మత్తయి 12:23-37).

**5) గౌరవము పొందదగిన వ్యక్తి** దేవునిని ఎరుగని వ్యక్తులతో సాంగత్యము చేయడు. పాపుల

మార్గమున నిలువక అపహాసకులు కూర్చుండుచోటను కూర్చుండడు. (కీర్త 1:1) అతడు దేవుని బిడ్డలైన క్రైస్తవులతోనే సహవాసము చేయును. పరిశుద్ధులతో సమాజముగ కూడుట మానడు (హెబ్రీ 10:25).

**6) దేవునికి భయపడువారిని అతడు గౌరవించును దైవసేవకులను గౌరవించును** (1 తిమోతి 5:12, 13; రోమా 12:10; 1 పేతురు 2:17).

**7) అతడు ప్రమాణము చేసి మాట తప్పడు.** హన్నా తన కుమారుడైన సమూయేలును దేవుని సేవకొరకు సమర్పించుకొందునని దేవునితో ఒప్పందము చేసెను. ఆమె దేవునితో చేసిన వాగ్దానము నిలువబెట్టుకొనెను (సమూయేలు 1:11; న్యాయాధిపతులు 11:20; 2 కొరింధి 1-17:18).

**8) అతడు తన ద్రవ్యమును బుద్ధిహీనముగ ఖర్చు చేయడు.** జ్ఞానయుక్తముగ ఖర్చు చేయును. దేవుని సేవకొరకు ఇచ్చును. అవసరతలలో యున్నవారికి సహాయము చేయును.

**9) అమాయకులైన వారి యొద్ద నుండి బహుమానములు స్వీకరించడు.** అమాయకులను నిందించడు. దుష్టుడైన అహాబురాజు యిద్దరు సాక్షుల అబద్ధసాక్ష్యములను బట్టి నాబోతును చంపి అతని ద్రాక్షతోటను స్వాధీనము చేసికొనెను. (1 రాజు 21:1, 16). యేసు ప్రభువు ప్రధాన యాజకుని యెదుట విచారింపబడుచుండగ అనేకులు ఆయన మీద అబద్ధ సాక్ష్యములు చెప్పిరి. కాని వారి సాక్ష్యములు ఒకదినికొకటి సరిపడలేదు (మార్కు 1:56).

దావీదు వలె మనము మన దేవుని వాక్యము విని, దాని ప్రకారము జీవిత కాలమంతయు యెహోవా మందిరములో నివసింపగోరవలెను (కీర్త 23:6). హృదయ పూర్వకముగ నమ్మి, పాపముల విషయమై పశ్చాత్తాపపడి, యేసు దేవుని కుమారుడని ఒప్పుకొని, పాప క్షమాపణ కొరకు బాప్తిస్మము పొందవలెను. అట్టి వారిని దేవుడు ఆయన కుటుంబ సభ్యులుగ, లేక సంఘ సభ్యులుగ వారిని అంగీకరించును. దావీదు యిచ్చిన పరిపూర్ణమైన సలహాలను మన జీవిత కాలమంతయు పాటించుచు విశ్వాసముతో జీవించిన యెడల దేవుడు మనకు నిత్యజీవమును అనుగ్రహించును.

- కబిత గూటం.

## సంక్షిప్త వార్తలు

2016 జూన్ 3వ తేదీ శుక్రవారం పోలవరం మండలం తాడిపూడిలోసోదరి యస్. రమాదేవిగారి యింటి ఆవరణములో గంభీరమైన సువార్త కూటము జరిగెను. ఈ సోదరి అంతకు పది సంవత్సరములకు ముందు సత్యవాణి టి.వి. కార్యక్రమముల ద్వారా, బైబిలు కోర్సు ద్వారా క్రీస్తును తెలిసికొని హైందవ కుటుంబములోనుండి క్రీస్తు కుటుంబములోకి తిరిగి జన్మించినది. తాను ఒక్కతే అయినను తన పట్టుదల, విశ్వాసమును బట్టి మరి కొందరిని క్రీస్తులోనికి మార్చి సోదరులు యన్. రత్నశేఖర్‌గారి సహాయ సహకారముల వలన తన గృహములోనే క్రీస్తు సంఘమును సమర్థవంతముగా నడుపుచున్నది. మరియు ఆమెయొక్క విశ్వాసము తన పుట్టింటివారి గ్రామము పెద్దేవంలో కూడ క్రీస్తు సంఘము స్థాపించబడెను. జూన్ 3వ తేదీన తాడిపూడిలోని సంఘము తమ పదియవ వార్షికోత్సవము జరుపుకొనగా, జూలై 18వ తేదీ సోమవారం పెద్దేవంలోని సంఘము తమ మూడవ వార్షికోత్సవమును జరుపుకొనిరి. తాడిపూడిలో జాషువా గారును, పెద్దేవంలో అమెరికానుండి వచ్చిన జాన్ వోబర్న్‌హార్స్ గారును వాక్యపరిచర్య చేసిరి. పెద్దేవంలో సోదరులు జగన్‌మోహన్‌గారు కుటుంబ సమేతముగా క్రీస్తు కొరకు బలముగా నిలబడి మంచి పనిచేయుచున్నారు.

2016 జూలై 15వ తేదీన కాకినాడ సత్యవాణి ఆవరణలో సువార్తికుల సదస్సు జరిగెను. పలు జిల్లాల నుండి, తెలంగాణా నుండి అనేకులు హాజరై దేవుని వాక్యమును ధ్యానించిరి. అమెరికానుండి వచ్చిన ప్రఖ్యాత మానసిక వైద్యులు బ్రదర్ జాన్ వోబర్న్‌హార్స్‌గారు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. తదుపరి ఆయన రిక్కీ గారితో కలిసి పోతుకూరు, అన్నవరం మండలంలో యున్న తిమ్మాపురం, పెద్దేవం, పెదబరద, నర్సీపట్నం మొదలగు గ్రామములు దర్శించి వాక్యపరిచర్య చేసిరి. ఆయనతో తన కుమార్తె రీనీ గారు కూడ వచ్చి పదిరోజులపాటు కాకినాడలో గడిపి ఆయా ప్రాంతములలోని సంఘములను దర్శించిరి. మొత్తము 18 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

2016 జూలై 14, 24 తేదీ ఆదివారపు ఆరాధనలో కాకినాడ క్రీస్తు సంఘములో సోదరులు జాన్ వోబర్న్‌హోర్స్‌గారు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. సంఘములో యున్న సభ్యులందరు ఒకే శరీరములో యున్నవివిధ అవయవములవలె సమిష్టిగా పనిచేసిన యెడల క్రీస్తు శరీరమైన సంఘము అభివృద్ధి జెందునని చక్కటి పాఠములను బోధించిరి. ఆయన కుమార్తె రీనీగారు, రిక్కీగారు నడుపుచున్న చిల్డ్రన్‌హోమ్‌లో యున్న బాల బాలికలకు బైబిలు కథలు, ఇంగ్లీషు పాటలు నేర్పుచు చిన్నబిడ్డలందరికీ క్రీస్తునందు ఆసక్తిని మరింత రేకెత్తించి సంతోషముతో తన తండ్రితో కలసి జూలై 26న స్వదేశమునకు బయలు వెళ్ళిరి.

'యేసుక్రీస్తు దేవుని కుమారుడు' అను పుస్తకమును వందలాది మంది చదువుచూ మేలు పొందుచున్నారు. సత్యవాణికి రూ. 60/-లు యమ్.ఓ. పంపి దీనిని పొందవచ్చును.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17
Date of Posting: 14 & 15th every month

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.